# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-05-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు.**

**2. ఆంధ్రప్రదేశ్‌లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్ పరీక్ష ఫలితాలు నిన్న విడుదలయ్యాయి.**

**3. తెలంగాణ రాష్ట్ర గీతంగా " జయ జయ హే తెలంగాణా " కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.**

**4. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా చివరి దశలో ఏడు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోని 57 స్థానాలకు రేపు పోలింగ్ జరుగుతుంది.**

**5. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

=========================

ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో నిన్న ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖేష్ కుమార్ మీనా పాత్రికేయులతో మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు రోజున ఎవరైనా కౌంటింగ్ కేంద్రంలో నిబంధనలను అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ముఖేష్ కుమార్ మీనా పేర్కొంటూ...

**......వాయిస్.... 35 సెకన్లు.....**

-------------------------

పోస్టల్ బ్యాలెట్ల ధృవీకరణపై కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి స్పష్టతనిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు లేఖ రాసింది. ఫాం 13ఏ పై ధృవీకరణ గెజిటెడ్ అధికారి సంతకం మాత్రమే ఉండి.. ముద్ర, హోదా లేకపోయినా ఆ ఓటు చెల్లుబాటు అవుతుందని ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ధృవీకరణ తర్వాతే ఫారం 13ఏ పై గెజిటెడ్ అధికారి సంతకం చేస్తారని, అందువల్ల

ముద్ర లేకపోయినా పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు అవుతుందని, అలాంటి ఓట్లను చెల్లుబాటు అయ్యేవిగా గుర్తించాలని రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్ పరీక్ష ఫలితాలు నిన్న విడుదలయ్యాయి. అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈనెల 6వ తేదీన నిర్వహించిన పరీక్షలకు 44 వేల 447 మంది విద్యార్థులు హాజరుకాగా... 96.71 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. జులై 22వ తేదీ నుంచి ప్రవేశాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశామని హేమచంద్రారెడ్డి పేర్కొంటూ....

**......వాయిస్..... 33 సెకన్లు.....**

-----------------------------

తెలంగాణ రాష్ట్ర గీతంగా " జయ జయ హే తెలంగాణా"కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో సమావేశమై అధికార చిహ్నం, రాష్ట్ర గీతంపై నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అధికార చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం మార్పులపై ఇంకా విస్తృతంగా చర్చలు జరపాల్సి ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. శాసనసభలో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 2వ తేదీన రాష్ట్ర గీతాన్ని మాత్రమే ఆవిష్కరించనున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

-----------------------------

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏడో విడత పోలింగ్ ప్రచార గడువు నిన్న సాయంత్రంతో ముగిసింది. దీంతో దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం పూర్తయింది. ఈ దశ ఏడు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోని 57 స్థానాలకు రేపు పోలింగ్ జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పోటీ చేస్తున్న వారణాసి స్థానంలో ఈ విడతలోనే పోలింగ్ జరుగుతుంది. దేశ వ్యాప్తంగా మొత్తం 543 లోక్‌సభ స్థానాలు ఉండగా, ఇప్పటివరకు ముగిసిన ఆరు దశల ఎన్నికల్లో 486 నియోజకవర్గాలకు ఓటింగ్ పూర్తయింది.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఉదయం దర్శించుకుంటారు. గత రాత్రి ఆయన తిరుమలకు చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు బిజెపి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం అమిత్ షా తిరుమలలోని వకుళమాత నిలయం అతిథి గృహానికి చేరుకున్నారు.

-----------------------------

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. పొగాకు ఉత్పత్తుల వాడకం వలన ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాల పట్ల ప్రజలకు అవగాహన కలిగించే లక్ష్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ 1987 నుంచి ప్రతీఏటా మే 31వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని నిర్వహిస్తోంది. "పొగాకు ఉత్పత్తుల నుంచి పిల్లలను దూరంగా ఉండేలా చేయడం" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని నిర్వహిస్తున్నారు. పొగాకు వాడకాన్ని వీడాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

-----------------------------

రోడ్డు ప్రమాదాల నివారించేందుకు రేపటి నుంచి కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి తీసుకువస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ నిబంధనల ప్రకారం అతి వేగంగా వాహనం నడుపుతూ పట్టుబడితే 1000 రూపాయల నుంచి 2 వేల వరకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే 500 రూపాయలు జరిమానా విధించనున్నారు. 18 ఏళ్ళలోపు ఉండే మైనర్ వ్యక్తులు వాహనం నడిపితే 25 వేల రూపాయలు జరిమానా విధించటంతో పాటు వారికి 25 ఏళ్ల వయసు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందకుండా నిషేధం విధించనున్నారు.

---------------------------

తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్– దోస్త్ పోర్టల్ ద్వారా ప్రవేశాలు పొందేందుకు రిజిస్ట్రేషన్ గడువును జూన్ 1 వరకు పొడిగించినట్లు కన్వీనర్ ఆచార్య ఆర్.లింబాద్రి తెలిపారు. విద్యార్థులు జూన్ 2వ తేదీ వరకు వెబ్ ఐచ్ఛికాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

---------------------------

బహుళ అంతస్థుల భవనాలు పూర్తిస్థాయిలో భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందేనని ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు స్పష్టం చేశారు. నిన్న జిల్లా పరిధిలో విజయవాడతో పాటు వివిధ ప్రాంతాల్లోని విద్యా సంస్థలు, ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాలు గేమింగ్ జోన్స్ తదితర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకుంటున్న ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ అంతస్తుల భవంతుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ఏదైనా ప్రమాదం జరిగితే తక్షణ స్పందన ప్రణాళికను అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అన్ని రకాల భవంతులు పూర్తిస్థాయిలో భద్రతా ప్రమాణాలు పాటించాలని.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండు రోజులు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. కోస్తా, రాయలసీమ జిల్లాలో వడగాల్పుల తీవ్రత కొనసాగుతుందని తెలిపింది. అలాగే తెలంగాణలో రేపటి నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ సందర్భంగా 29 జిల్లాలకు పసుపు రంగు హెచ్చరికను జారీ చేసింది. మరో వైపు నైరుతి రుతుపవనాలు కేరళ, దక్షిణ తమిళనాడును తాకాయని, జూన్ మొదటి వారంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు నైరుతి రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

---------------------------

తెలంగాణలోని అమ్రాబాద్ పులుల సంరక్షణ ప్రాంతం పరిధిలో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధిస్తున్నట్లు అటవీశాఖ తెలిపింది. ఈ మేరకు అటవీ సంరక్షణ ప్రధాన అధికారి, "ఎలూసింగ్ మేరు" బఉత్తర్వులు జారీ చేశారు. జులై 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. పర్యాటకులకు మార్గమధ్యలో నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామని, ప్లాస్టిక్ బాటిళ్లను అనుమతించబోమని చెప్పారు. ఆహారపదార్థాల వ్యర్థాలను చెత్తకుండీల్లో వేయాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, మల్టీ లేయర్ ప్లాస్టిక్, లీటర్.. అంతకు తక్కువ ఉండే ప్లాస్టిక్ బాటిళ్లను అనుమతించబోమని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో  నేషనల్ క్యాడెట్ కార్ప్స్ – ఎన్ సీ సీ డైరెక్టరేట్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ఎన్ సీసీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.మధుసూదన్ రెడ్డి చెప్పారు. నిన్న గుంటూరులో ఎన్సీసీ వార్షిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్సీసీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు.

======================